క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు.పలువురు గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు.

ప్రశాంతంగా మాన్యం కౌలుకు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు.. పాల్గొన్న రైతులు

దొర్నిపాడు: మండల కేంద్రంలో ఈఓ వీరయ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మాన్యం కౌలు వేలం పాటలు ప్రశాంతగా జరిగాయి. శ్రీమాధవస్వామి దేవస్థానానికి చెందిన 36.72 ఎకరాలను రూ.5.38లక్షలకు పాడగా గతేడాది రూ.5.03లక్షలకు పోయిందని తెలిపారు. అలాగే శ్రీగణాధిపతి, శ్రీచౌడేశ్వరి ఆలయాలకు చెందిన 19.87 ఎకరాలకు రూ. రూ.4.77లక్షలకు రైతులు దక్కించుకున్నారు. గతేడాది ఇదే పొలం రూ.4.56 లక్షలకు పాడినట్లు చెప్పారు. రెండు ఆలయాలకు కలిపి రూ.56 వేల ఆదాయం సమకూరిందని వివరించారు.

ఘనంగా గంధోత్సవం



చాగలమర్రిలో గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

చాగలమర్రి: స్థానిక చిన్నమకానం వీధిలో వెలసిన హజ్రత్ సయ్యద్ దర్వేష్ షా ఖాద్రీ స్వాముల వారి గంధోత్సవం ఆదివారం వైస్ ఎంపీపీ ముల్లా రఫీ ఇంటి నుంచి మేళ తాళాలతో, ఫక్కీర్లతో కలిసి పెద్దమకానం, మొయిన్ బజార్‌ల మీదుగా ఊరేగింపుగా దర్గాకు చేరుకున్నారు. అనంతరం అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులతో కలిసి దర్గా వద్ద స్వామి వారికి గంధం, చాదరు, బాసికాలు సమర్పించి, ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఆదివారం గంధం, 17న ఉరుసు, 18వ తేదీన జియారత్‌తో వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

కౌలు వేలంలో పెరిగిన ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఈర్నపాడు గ్రామంలో కొలువైన శ్రీ కోదండ రామ,ఈశ్వర,చెన్నకేశవస్వామి ఆలయాలకు చెందిన 5.17 ఎకరాలకు కౌలు వేలాల ద్వారా గతంలో రూ.70 వేలు రాగా ఈ ఏడాది రూ.73,500 వచ్చినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఓంకార సిద్ధేరస్వామి దేవస్థానికి చెందిన 2.50 ఎకరాలకు గతేడాది రూ.49 వేలు రాగా ప్రస్తుతం రూ.85 వేలు వచ్చిందన్నారు. బీ.కోడూరులోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానానికి చెందిన 51.53 ఎకరాలకు నిర్వహించిన కౌలు వేలం ద్వారా గత ఏడాది రూ.3,65,500 ఆదాయం రాగా ప్రస్తుతం రూ.5.34 లక్షలు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమాల్లో నంద్యాల డివిజన్ దేవదాయ ఇన్‌స్పెక్టర్ శశికుమార్,సిబ్బంది నాగరాజు రైతులు పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల సందడి

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక,తమిళనాడు,మహారాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ముందుగా రుద్ర,బ్రహ్మ,విష్ణు గుండం కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. వేకువజాము నుంచి ప్రారంభమైన స్వామి,అమ్మవార్ల దర్శనం రాత్రి ఏకాంత సేవ వరకు నిర్విరామంగా కొనసాగింది. మహానందీశ్వరుడి దంపతులకు రాత్రి ఏకాంతసేవ పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానందీశ్వరుడిని అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారి పార్వతి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. క్షేత్రానికి వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ నీలకంఠ రాజు స్వాగతం పలికారు. ఈ మేరకు వారు స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.



కొండమాయపల్లెలో పిల్లర్స్ దశలో భవనం



శ్రీరంగాపురంలో పై కప్పు వేసిన దృశ్యం



శ్రీరంగాపురంలో నూతన భవనాల కోసం సిద్ధంగా ఉన్న వస్తు సామగ్రి

అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు

- నాడు–నేడు కింద ఏడు భవనాల మంజూరు
- రూ.13లక్షల చొప్పున నిధులు విడుదల
- వివిధ దశల్లో నిర్మాణాలు

రుద్రవరం: చిన్నారుల భవిష్యత్‌ను తీర్చి దిద్దే నిలయాలు అంగన్‌వాడీ కేంద్రాలు. ఆట పాటలతో పాటు విద్యాబుద్ధులు అలవర్చుకొని బడి బాట పట్టేందుకు దోహదపడేవి. అలాంటి కేంద్రాల్లో చిన్నారులకు తగిన వసతులు కల్పించాల్సి ఉంది. అయితే వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి సరైన భవనాలు, వసతులు లేక చిన్నారులు ఇబ్బందులు పడేవారు. సౌకర్యాల లేక పోవడంతో తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పేందుకు తల్లిదండ్రులు విముఖత చూపేవారు. గత ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దేందుకు నడుం బిగించింది. కొత్త భవనాలు, చిన్నారులు ఆడుకునేందుకు అవసరమైన క్రీడా, వస్తు సామగ్రి తదితరాలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టింది. దీంతో ఆయా కేంద్రాల్లో ఇప్పుడిప్పుడే వసతులు మెరుగుపడుతుండటంతో చిన్నారుల సంఖ్య సైతం పెరుగుతోంది. ఇక గర్భిణులు, బాలింతలకు పౌష్టికా



ముత్తలూరు రెండో సెంటర్ భవనం చివరి దశలో నిర్మాణం

హారం క్రమం తప్పకుండా అందజేస్తున్నారు.

కేంద్రాలు ఇలా..

మండలంలోని 21 గ్రామ పంచాయతీలు, 22 మజరా గ్రామాల్లో కలిపి మొత్తం 60 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.వాటిల్లో 11 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మరో నాలుగు కేంద్రాలకు అద్దె ఫ్రీ భవనాలు ఉన్నాయి. మిగిలిన 45 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటిల్లో వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇరుకు గదులు..అందులోనే పోషక,పౌష్టికాహర వస్తు,సామగ్రి, వంట సామాన్లు, రికార్డులు, ఆట,పాటలకు సంబంధించిన వస్తువులు ఉంటున్నాయి. ఇక వాష్ రూంలు, నీటి వసతి వంటివి అందులోనే ఉంటున్నాయి.దీంతో చిన్నారుల ఆట,పాటలకు అంతరాయంగా ఉండేది. అయినప్పటికీ అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయాలు కేంద్రానికి వచ్చే చిన్నారులకు ఇబ్బందులు లేకుండా అప్పటికప్పుడు సామగ్రిని సర్ది ఆట పాటలతో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. అలాగే ప్రభుత్వం నుంచి పౌష్టికాహారం సక్రమంగా అందిస్తూ వారి ఎదుగుదలకు దోహదపడుతున్నారు. గ్రామాల్లో చిన్నారుల సంఖ్య పెరిగిన చోట ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితిని అంగన్‌వాడీ కేంద్రాల అధికారులు గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం స్పందించి నాడు–నేడు కింద మండలానికి ఏడు కొత్త భవనాలు మంజూరు చేసింది.

మంజూరైన నూతన భవనాలు..

గత ప్రభుత్వం నాడు–నేడు కింద మండలానికి ఏడు నూతన భవనాలు మంజూరు చేసింది. ఒక్కో భవనానికి రూ.13లక్షల చొప్పున రూ.91లక్షలు మంజూరు చేసింది. అందులో కొండమాయపల్లె–1, పేరూరు–1, డీ.కొట్టాల–1, శ్రీరంగాపురం–2,నర్సాపురం–1,ముత్తలూరు–1 చొప్పున నూతన మంజూరయ్యాయి.అప్పట్లోనే పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం వాటి నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.కొండమాయపల్లెలో పిల్ల ర్లు పూర్తి చేసి పై కప్పు వేసేందుకు సిద్ధంగా ఉంది. డీ.కొట్టాల, శ్రీరంగాపురం, ముత్తలూరు గ్రామాల్లో 4 భవనాలు పైకప్పు పూర్తయ్యి అంతర్భాగంలో గోడలు కడుతున్నారు. పేరూరు, నర్సాపురంలో పైకప్పు దశలో పనులు సాగుతున్నాయి.

వీఆర్‌ఏ పోస్టులు భర్తీ చేయాలి

నంద్యాల(అర్బన్): జిల్లాలో ఖాళీగా ఉన్న వీఆర్‌ఏ పోస్టులను భర్తీ చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ కోరారు. వీఆర్‌ఏ వ్యవస్థ నిర్వీర్యం కాకుండా తెలంగాణ ప్రభుత్వ తరహాలో ప్రస్తుత ప్రభుత్వం పే స్కేల్ అమలు చేసి 60ఏళ్లు పైబడిన వృద్ధుల స్థానంలో వారి వారసులను నామిని వీఆర్‌ఏలుగా నియమించాలంటూ ఆదివారం న్యాయశాఖ, మైనార్టీ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌కు విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలను ఫుల్‌టైమ్ ఉద్యోగులుగా ప్రభుత్వ కార్యాలయాల్లో అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్, కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేయించుకుంటున్నారన్నారు. వీఆర్‌ఏల వేతనాల పెంపుపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును ఒకే తరహాలో అమలు చేసి రాష్ట్రంలో కూడా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆ సంఘం నంద్యాల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అజిత్ బాషా, మహబూబ్‌బాషా డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న భవన కార్మికుల క్లెయిమ్‌లను మంజూరు చేయాలని కోరారు. 60సంవత్సరాలు పైబడిన కార్మికులందరికీ రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. జిల్లా అధ్యక్షుడు రఫీ, ఖాజా, మాబుల్, చాంద్, నూర్‌బాషా పాల్గొన్నారు.

తరలిపోతున్న వృక్ష సంపద

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాలు,నల్లమల అటవీ సమీప ప్రాంతాల నుంచి కొందరు దుండగులు పెద్ద పెద్ద వృక్షాలను కూల్చి ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా తరలించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం ట్రాక్టర్లలో భారీ వృక్షాల మొద్దులను తరలించుకెళ్తున్నప్పటికీ రెవెన్యూ,అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రహదారుల పక్కన,వాగులు, వంకల గట్లపై, ప్రభుత్వ భూముల్లో ఉన్న భారీ వృక్షాలను కూల్చి వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. అలాగే చెట్లను ఇష్టానుసారంగా కూల్చడం వల్ల ప్రదనం కనుమరుగై వాతావరణ సమతుల్యతకు భంగం వాటిల్లే ప్రమాదముందని పర్యావరణ ప్రియులు ఆవేదన



నర్సాపురం సమీపంలో భారీ చెట్టును నరికి ట్రాక్టరులో తరలిస్తున్న దృశ్యం

వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి అనుమతులు లేకుండా చెట్లను కూల్చేవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హైదరాబాద్ నుంచి మహానందికి పాదయాత్రగా..

మహానంది: కోరిన కోరిక నెరవేరడంతో హైదరాబాద్ నుంచి మహానందికి పాదయాత్రగా వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు ఆ కుటుంబ సభ్యులు. వినుకొండ పట్టణానికి చెందిన శ్రవణ్ కుమార్ ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. తన చెల్లిలికి వివాహమై ఏళ్లు గడుస్తున్నా సంతానం లేకపోవడంతో మహానంది ఆలయానికి చేరుకొని పూజలు చేపట్టగా ఆమెకు సంతానం కలిగింది. కోరిక నెరవేరడంతో చెల్లెలు శాంతి, బావ లక్ష్మీశ్రీనివాస్ మహానంది ఆలయానికి చేరుకొని కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్వామి అమ్మవార్ల



శ్రవణ్‌కుమార్, కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం అందిస్తున్న పండితులు

అనుగ్రహం వల్ల తమ కోరిక నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు.

యువకుడి ఆత్మహత్య

మహానంది: కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బొల్లవరం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిన్న నరసింహ (18) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడని, నొప్పిని తాళలేక ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

చిరుత సంచారంపై భయం భయం

మహానంది: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంగణంలోకి చిరుత రావడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అటవీ శాఖ డీఆర్‌ఓ హైమావతి, ఎఫ్‌డీఓ ప్రతాప్, సిబ్బంది ఆదివారం ఘటన స్థలానికి చేరుకొని చిరుత పాదముద్రలను సేకరించారు. వారు మాట్లాడుతూ అటవీ సమీప ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుత జాడ, కదలికలు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని చెప్పారు.

బక్రీద్ పండుగకు ఏర్పాట్లు పూర్తి

- నేడు బక్రీద్ పర్వదినం
- ఈద్గాలతో పాటు మసీదుల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు
- త్యాగాలకు ప్రతీక



జిల్లెల్లలో ఈద్గా వద్ద చదును చేసిన దృశ్యం,




బక్రీద్‌కు ముస్తాబైన చాబోలు దర్గా

గోస్పాడు: త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ. ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండగల్లో బక్రీద్ ఒకటి. మసీదుల్లో నమాజు చేయించే ఖాజీలు, మౌల్వీలు తమ ఆధ్యాత్మిక ప్రసంగం అనంతరం దువా చేస్తారు. సర్వ మానవాళి శాంతి కోసం, జీవితంలో చేసిన పాపాల విముక్తి కోసం అల్లాహ్‌ను వేడుకుంటారు. సమాజు, దువా అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకుంటారు. కొందరు బక్రీద్ సందర్భంగా ఉపవాసాలు ఉండగా వీటి ప్రత్యేకత, పుణ్యం తెలుసుకొని మరి కొందరు ఈదు ఒక రోజు ముందు రోజా పాటిస్తారు. ఇంకొందరు పండగ రోజు ఈద్ నమాజ్ పూర్తయ్యే వరకు ఏమీ తినకుండా వెళ్లి ప్రార్థనలు చేస్తారు. నేడు పండుగ సందర్భంగా నిర్వహించే ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా..ముస్లింలు ఈ మాసంలోనే హజ్ యాత్ర చేపడతారు. పవిత్ర మక్కాను సందర్శిస్తారు. సౌదీ అరేబియాలోని మక్కా నగరంలోని మస్జిద్ అల్ హరామ్లోని కాబా చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణలు చేస్తారు.

చాగలమర్రి: అల్లాహ్ ఆజ్ఞను శిరసావహిస్తూ దైవ ప్రవక్త ఇబ్రహీం ఖలీలుల్లా తన 9 ఏళ్ల వయసున్న కుమారుడు ప్రవక్త యిస్మాయిల్ జబీవుల్లాను బలిదానం (ఖుర్బానీ) ఇవ్వటానికి పూనుకున్న త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను ముస్లింలు 'ఇద్–ఉల్–జుహ'గా నిర్వహించుకుంటారు. ఖురాన్ ప్రకారం అల్లా ముస్లింలకు రెండు పండుగలను చేసుకోవటానికి మాత్రమే అనుమతించాడు. అందులో మొదటిది పవిత్ర రంజాన్, రెండవది 'ఇద్–ఉల్–జుహ'. ఈ పండుగ ఇస్లాం మత దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం ఖలీలుల్లా త్యాగ నిరతికి ప్రతీకగా నిర్వహించుకుంటారు. ప్రవక్త ఇబ్రహీం ఖలీలుల్లా అలైహి వస్సల్లం దంపతులకు 95 సంవత్సరాల వృద్ధాప్యంలో దైవానుగ్రహంతో కలిగిన ఏకైక సంతానం ప్రవక్త ఇస్మాయిల్ జబీవుల్లాను అల్లాహ్ పేరిట బలిదానం ఇవ్వాలని కలలో అల్లాహ్ ఆజ్ఞాపించగా..తన 9 ఏళ్ళ కుమారుడిని బలి ఇవ్వటానికి సిద్ధపడగా ఆయన త్యాగానికి ముగ్ధుడైన అల్లా కాబతుల్లా (హాజీలు హజ్ చేసే ప్రదేశం) కు దైవ దూతను పంపి బలిదానాన్ని ఆపి వాటికి బదులుగా ఒక పొట్టేలును పంపి బలిదానం (ఖుర్బానీ) చేయవలసిందిగా ఆజ్ఞాపించటంతో ఆ పొట్టేలును బలిదానం చేశారు. నాటి నుంచి త్యాగానికి ప్రతికగా ప్రతి ఏడాది బలిదానం చేసి మూడు భాగాలు చేసిన మాంసంలో ఒక భాగం పేదలు, రెండవది బంధువులకు, మూడవ భాగం కుటుంబ సభ్యులకు సమాన భాగాలుగా పంచి పెడతారు.

నాడు–నేడు



నాడు- శిథిలావస్థకు చేరి..



నేడు.. సర్వాంగ సుందరంగా తయారైన బంగ్లా

నంద్యాల(అర్బన్): పట్టణంలోని బొమ్మలసత్రం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వెనుక వైపున మొదటి బంగ్లా బ్రిటీష్ వారి సమయంలో నిర్మించారు. నాడు వారి నిర్మాణశైలిలో ఈ బంగ్లాలోకి గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా నిర్మించారు. టేకు, కలపతో పాటు బండరాళ్లతో చెక్కు చెదరకుండా నిర్మించిన బంగ్లా రాజసం ఉట్టిపడేది. దాదాపు 20 ఏళ్ల పాటు ఆర్‌డీఓలు బంగ్లాలో నివాసం ఉన్నారు. ఆ తరువాత భవనం బాగోగులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరింది. గత ప్రభుత్వం మరమ్మతులు చేయించడంతో ప్రస్తుతం నాటి ఠీవీని సంతరించుకుంది.

పచ్చిరొట్ట.. పోషకాల పుట్ట

ఏడాది పొడవునా పొలానికి విరామం లేకుండా పంటలు సాగు చేయడం, ఎరువులు, పురుగు మందులు మితిమీరి వినియోగంతో భూములు నిస్సారంగా మారుతున్నాయి. ఫలితంగా దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతోంది. సాగు ప్రారంభంలో పచ్చిరొట్ట, అపరాల సాగు ద్వారా భూసారం పెంచుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఖరీఫ్‌లో వరి నాట్లు వేసే ముందు సేంద్రియ ఎరువులు వినియోగించాలని చెబుతున్నారు. ఇందులో భాగంగా జీలుగ, పిల్లిపెసర, జనుము తదితర విత్తనాలను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తుంది.

- మీటి సాగుతో పెరగనున్న భూసారం, దిగుబడి
- తగ్గనున్న ఎరువులు, పురుగు మందుల వినియోగం
- ఖరీఫ్‌కు ముందు పెంపకంతో అధిక ప్రయోజనం
- జీలుగ, పిల్లి పెసర, జనుము సాగుకు ప్రాధాన్యం
- 50 శాతం రాయితీపై ఆర్బీకేల్లో పంపిణీ

ఆళ్లగడ్డ: రసాయనిక ఎరువులు ఇష్టారాజ్యంగా వాడటం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటోంది. దిగుబడలు తగ్గుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పశుసంపద ఏటికేడు తగ్గిపోతుండటంతో సేంద్రియ ఎరువులు వాడకం తగ్గింది. చేసేది లేక రైతులు రసాయానిక ఎరువులపై ఆధారపడి నష్టాలు మూటగట్టుకుంటున్నారు. ఈ క్రమంలో పెట్టుబడులను నియంత్రించడంతో పాటు భూసారాన్ని పెంచి.. నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు ప్రభుత్వం జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పైర్లను సాగు చేసేలా ప్రోత్సహిస్తోంది. అందుకు అనుగుణంగా వ్యవసాయశాఖ ఆర్బీకేల్లో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందుబాటులో ఉంచింది. పచ్చిరొట్టతో భూమి సారవంతంగా మారుతుందని రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

పచ్చిరొట్ట ఎరువు వాడకం ఇలా..

పచ్చిరొట్ట పైర్లను పూత దశలో నేలలో కలియదున్నాలి. ఆ సమయంలో ఎకరాకు 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్ వేస్తే త్వరగా కుళ్లుతుంది. ప్రధాన పంటకు ఈ 50 కిలోల ఎరువును తగ్గించి వాడవచ్చు. పచ్చిరొట్ట మురగకుండా వేరే పంటలు వేయకూడదు. పచ్చిరొట్ట సాగు చేసే పొలాల్ల నత్రజని తక్కువగా ఉంటే ఎకరాకు 8 కిలోల నత్రజని వేయడం వల్ల మొక్క పెరిగి రొట్ట ఎక్కువ వస్తుంది. కాగా..జనుము ఎకరాకు 8 నుంచి 10 కిలోలు, జీలుగ ఎకరాకు 12 నుంచి 14 కిలోలు, పిల్లి పెసర ఎకరాకు 6 నుంచి 8 కిలోల విత్తనాలు వేయాలని అధికారులు పేర్కొంటున్నారు.



రుద్రవరం మండలం పరిధిలో సాగైన జీలుగ,



బాచేపల్లి ఆర్బీకేలో సబ్సిడీపై జీలుగ విత్తనాలు తీసుకెళ్తున్న రైతులు

పెరగనున్న భూసారం..

భౌతిక స్థితి మెరుగుపడి నేలకు నీటిని, పోషకాలను నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుంది. నేలలో కలియదున్నిన పంట కుళ్లేటప్పుడు విడుదల చేసే ఆమ్లాల వల్ల నేలలో మొక్కలకు భాస్వరం, పొటాష్ అందడమే కాక గాలిలోని నత్రజని నేలలో స్థిరీకరించబడటంతో నేల సారం పెరుగుతుంది. భూమికి సేంద్రియ పదార్థం అందడం వల్ల నేలలో సూక్ష్మజీవుల సాంద్రత పెరిగి తద్వార పంట వేర్ల ఆరోగ్యం, పటుత్వం పెరుగుతుంది. ఫలితంగా చీడపీడలు బెడద తగ్గుతుంది. సూక్ష్మ పోషకాలు ఎక్కువగా పంటలకు లభిస్తాయి. తక్కువ వ్యయంతో ఆరోగ్యకరమైన దిగుబడి సాధించవచ్చు

భూమిలో నైట్రోజన్ పెంపు..

వరి చేలల్లోని పొలాల్లో నైట్రోజన్ పెంపునకు పచ్చి రొట్ట ఎరువు అధికంగా ఉపయోగ పడుతుంది. ముఖ్యంగా చౌడు భూముల్లో ఉన్న చౌడు విరిగి పోయి భూసారం పెంచేందుకు జీలుగ దోహదపడుతోంది. జీలుగ, జనుము పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుంది. ఉప్పునీరు ఉన్న ప్రాంతాల్లో దీని ప్రభావం అధికంగా ఉంటుంది. సారవంతమైన భూమిలో ఎరువులు ఉపయోగించాల్సిన అవసరం ఉండదు. పురుగు, చీడపీడల నివారణ మందుల వినియోగమూ తక్కువే.

మండలాల వారీగా వరి సాగు విస్తీర్ణం, అందుబాటులో ఉన్న పచ్చిరొట్ట విత్తనాలు

మండలం	ఆర్బీకేలు	రైతులు	సాగు విస్తీర్ణం ఎకరాల్లో	అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు (క్వింటాళ్లలో)
రుద్రవరం	16	9,713	16,542	230
దొర్నిపాడు	9	4,360	10,574	35
ఆళ్లగడ్డ	12	11,280	19,250	215
శిరివెళ్ల	16	10,794	18,967	570
ఉయ్యలవాడ	11	5,794	18,344	55
చాగలమర్రి	17	12,546	20,147	000

ఏటా జీలుగ సాగు చేస్తా



వరినాట్లు వేసే ముందు పచ్చిరొట్ట సాగు చేస్తే మేలని అధికారులు సూచిస్తుండటంతో మూడేళ్లుగా జీలుగ సాగు చేసి పూతకు వచ్చిన తరువాత భూమిలో కలియదున్ని వరి నాట్లు వేస్తున్నాం. దీంతో రసాయనిక ఎరువుల ఖర్చు చాలా వరకు తగ్గింది. వడ్లు కూడా తాలు లేకుండా, బియ్యం గింజ విరగకుండా చాలా నాణ్యత పండటంతో పాటు దిగుబడులు కూడా ఎక్కువగానే వస్తున్నాయి.

– లింగన్న, రైతు, తిప్పారెడ్డిపల్లె

రసాయనిక ఎరువుల వాడకం తగ్గింది



ప్రభుత్వం సగం ధరకే పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తుంది. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ప్రతి సంవత్సరం జీలుగ సాగు చేస్తున్నా. దీంతో పొలంలో అక్కడక్కడా ఉన్న చౌడు తగ్గిపోయింది. రసాయనిక ఎరువులు వేసి సాగు చేసిన దానికంటే పచ్చిరొట్ట ఎరువులతో సాగుచేసిన వడ్లు నాణ్యతగా ఉంటున్నాయి. పురుగు మందులు, రసాయనిక ఎరువుల వాడకం కూడా తగ్గింది. – పుల్లయ్య, రైతు, క్రిష్టిపాడు

పచ్చిరొట్ట వైపు రైతుల మొగ్గు



రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గించి మెరుగైన, నాణ్యమైన దిగుబడులే లక్ష్యంగా ప్రభుత్వ అన్ని చర్యలు తీసుకుంటోంది. ప్రతి ఆర్బీకేలో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. 50 శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీ ముమ్మరంగా కొనసాగుతోంది. గతంలో కంటే ప్రస్తుతం రైతులు సేంద్రియ సాగుకు మొగ్గు చూపుతున్నారు.

– నాగేంద్రప్రసాద్, ఇన్‌చార్జి ఏడీఏ